# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట


## ప్రజావాణి దరఖాస్తులకు
# సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్



ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్ అక్టోబర్ 13, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీ  ్మనారాయణ, నర్సింగరావు లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (72) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార బోర్డులను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

## బాల్య వివాహాలు
# లేని జిల్లాగా మార్చాలి

**నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణ పేట, అక్టోబరు 13 ప్రభాతవార్త :** నారాయణపేటను బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో విజన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార బోర్డులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శాంతి భద్రతలతో పాటు సమాజ అభివృద్ధికి మహిళా సాధికారత – మిగతా4లో..

## మైనర్ బాలికపై అత్యాచారం..
# పోక్సో కేసు నమోదు

**మహబూబ్‌నగర్ (చిన్నచింతకుంట) అక్టోబరు 13 ప్రభాతవార్త:** ప్రేమ పేరుతో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా మట్టంపల్లి మండలం బోజ్జతాండకు చెందిన చందర్ నాయక్ చిన్నచింతకుంట మండలం ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి నిందితునుపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.




విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

## ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన
# పథకం రైతులకు వరం

**మాజీ మంత్రి, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ...**

**గద్వాలటౌన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఖప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజనఖ పథకాన్ని రూపొందించిందని,ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం రైతులకు వరం లాంటిదని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె.అరుణమ్మ అన్నారు. సోమవారం గద్వాలలోపట్టణంలోని డికె. బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ...దేశంలో 100 జిల్లాల్లో ఈ పథకం అమలవుతుందని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గద్వాల జిల్లా , నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలను ఎంపిక చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 4 జిల్లాలకు అవకాశం రాగా,ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో 3 జిల్లాలు ఎంపిక కావడం జరిగిందన్నారు.మొదటి విడతలో 960 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని,రైతులకు సులభతర రుణాలు, నీటిపారుదల సౌకర్యాల మెరుగుదల ప్రధాన – మిగతా4లో..

## అవసరమైన
# నిధులు తెస్తా..

### జడ్చర్లను పూర్తిగా అభివృద్ధి చేస్తా..



వరద కాల్వల నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- వరద కాల్వల నిర్మాణానికి అదనపు నిధులు తీసుకొస్తా
- రూ.12.5 కోట్లలో పాత బజారుకు ప్రాధాన్యతనిస్తా
- మరో రూ.70 కోట్లు తీసుకొచ్చేందుకు కృషి చేస్తా
- లే అవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా గతంలో అనుమతులు
- మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయకుండా తప్పించుకున్న రియల్టర్లు
- అభివృద్ధి చేయని రియల్టర్లను ప్రజలు నిలదీయాలి : జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, అక్టోబరు 13 ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణంలో వరద నీటి కష్టాలను శాశ్వతంగా తొలగించడానికి అవసరమైన అదనపు నిధులను తీసుకు వస్తానని, జడ్చర్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. వరద నీటి కాల్వల నిర్మాణంకోసం ఇదివరకే మంజూరైన రూ.14 కోట్లు కాకుండా,ప్రస్తుతం రోడ్లు, డ్రైన్ల కోసం రూ.12.5 కోట్లు కూడా మంజూరయ్యాయని, ఇవి కాకుండా మరో రూ.70కోట్లు జడ్చర్ల అభివృద్ధి కోసం తీసుకురావడానికి కృషిచేస్తున్నానని వెల్లడించారు. జడ్చర్ల, బాదేపల్లి, కావేరమ్మపేట ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. జడ్చర్లలో రూ.14కోట్లతో చేపడుతున్న వరద కాల్వల (స్టామ్ వాటర్ డ్రైన్స్) నిర్మాణానికి అనిరుధ్ రెడ్డి సోమవారం శంఖుస్థాపన చేసి, నిర్మాణ పనులను ప్రారంభించారు. జడ్చర్ల పట్టణంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ముంపునకు గురవుతున్న ప్రాంతాలకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగానే ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియా ప్రతినిధుల నుద్దేశించి మాట్లాడారు. పట్టణంలో వరద నీటి కష్టాలను పూర్తిగా తొలగించడానికి, వాన నీళ్ల రోడ్లపై నిలుకుండా చేయడానికి వరద కాల్వల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. దీనికోసం ప్రస్తుతం తీసుకొచ్చిన నిధులు కాకుండా అదనపు నిధులను తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. పట్టణ ప్రగతి లో భాగంగా ప్రస్తుతం మంజూరైన రూ.12.5 కోట్ల నిధులలో రూ.5 కోట్లను జడ్చర్ల పాత బజారు ప్రాంతానికే కేటాయించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.కావేరమ్మపేట కూడా తమ సొంత గ్రామమే అని ఆ ప్రాంతాన్ని కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిలర్లు కూడా తమ ప్రాంతాలకే నిధులన్నీ ఇవ్వాలని పట్టుబట్టకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని అనిరుధ్ రెడ్డి కోరారు. జడ్చర్ల పట్టణ అభివృద్ధి కోసం రూ.70 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఈ నిధులు మంజూరైతే జడ్చర్ల పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుంతని అభిప్రాయపడ్డారు. కాగా జడ్చర్ల ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తామువేసిన లేఅవుట్లలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధిచేసిన తర్వాత మాత్రమే మున్సిపాలిటీ మార్టిగేజ్‌ను విడుదలచేయాల్సి ఉండగా, ఎలాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయకుండానే గతంలో ఉన్న బీఆర్ఎస్ నేతల సహకారంతో మార్టిగేజ్‌ను విడిపించుకుపోయారని అనిరుధ్ రెడ్డి విమర్శించారు. వాళ్లు చేయాల్సిన పనులు అప్పుడు చేయకపోగా ప్రైవేటు లే అవుట్లలో అభివృద్ధి చెందిన నివాసిత ప్రాంతాలను అభివృద్ధి చేసే భారం తమ మీద పడిందని వాపోయారు. ఈ సందర్భంగా కొందరు రియల్ వ్యాపారుల పేర్లను ప్రస్తావిస్తూ తాము చేయాల్సిన పనులు చేయకుండా తప్పించుకుపోయిన రియల్టర్లను నడిరోడ్డున నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ కోనేటి పుష్పలత, కమీషనర్ లక్ష్మారెడ్డి, ఇతర కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఎంపీ మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు
- రైల్వే నిధులు భూమిలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం
- ధరూర్ మండలంలో 50 ఎకరాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు
- అలంపూర్ ఆలయాలకు యునెస్కో గుర్తింపు పొందేందుకు ప్రధాని దృష్టికి తీసుకు వెళ్తా
- నాగర్ కర్నూల్ ఎమ్. పి.మల్లు రవి హామీ

## గద్వాల్ జిల్లాకు బహుముఖ
# అభివృద్ధి ప్రణాళికలు

**అలంపూర్ అక్టోబర్ 13, ప్రభాతవార్త :** నాగరికర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డా.మల్లురవిని గద్వాల్ సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు, కలిసి గద్వాల్ అభివృద్ధి కోసం పలు వినతులు చేసారు.ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి ఎంపీ డా.మల్లు రవి పలు కీలక అంశాలపై హామీలు ఇచ్చి ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఇదిలా ఉండగా మండల పునర్విభజనలో బిజ్వారం, పూడూరులను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని సూచించినట్టు తెలిపారు. అలాగే, దేవాదాయ శాఖ పరిధిలో గద్వాల్ నది అగ్రహారం సమీపంలో ఉన్న పురాతన ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఎండోమెంట్ లో విలీనం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.విద్యా రంగంలో, ఐటీఐ కాలేజీని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్"గా అభివృద్ధి చేయడానికి కృషి జరుగుతోందని, దీనిని టెండర్ దశకు తీసుకువచ్చిన ఘనత స్థానిక నాయకత్వానికి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, గద్వాల్ – మిగతా4లో..

# ఆకస్మిక మరణాలను నియంత్రించేందుకే సీపీఆర్

- ప్రతి ఒక్కరూ సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి... సీపీఆర్ అవగాహనతో అనేక ప్రాణాలు కాపాడవచ్చు..
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...




సీపీఆర్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 13 ప్రభాత వార్త:** ఆకస్మిక మరణాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సీపీఆర్ నిర్వహించే విధానాలను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై అవగాహన కల్పించేందుకు సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్ జిల్లా అధికారులకు సీపీఆర్ ప్రక్రియను వివరంగా చూపించారు. డీఎంహెచ్వో డాక్టర్ రవికుమార్ జిల్లా అధికారులతో సీపీఆర్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేలాది మంది గుండెపోటుతో ఆకస్మికంగా మరణిస్తున్నారని,ఈ మరణాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ సీపీఆర్ ప్రక్రియ నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సీపీఆర్‌లో ఛాతి దగ్గర నొక్కడం, రెస్క్యూ శ్వాసలు ఇవ్వడం ద్వారా శరీరమంతా ఆక్సిజన్ కలిగిన రక్తప్రసారం జరిగి గుండె సాధారణ స్థితికి వస్తుందని, దీంతో ప్రాణాపాయం నుంచి 50 శాతం వరకు రోగులు బతికే అవకాశం ఉంటుందని వివరించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీపీఆర్ పై అవగాహన శిబిరాలు నిర్వహించాలని,అలాగే స్కూల్స్, కాలేజీలు, అంగన్వాడీ కార్యకర్తలకు కూడా సీపీఆర్ శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటిలో కనీసం ఒకరు అయినా సీపీఆర్ నేర్చుకుంటే, ఎవరైనా గుండెపోటుతో కుప్పకూలినప్పుడు వెంటనే ప్రథమ చికిత్స ఇవ్వగలరన్నారు. ఇది ఒక ప్రాణాన్ని కాపాడడమే కాకుండా, ఒక కుటుంబాన్ని కాపాడినట్లే అవుతుందని కలెక్టర్ వివరించారు. సీపీఆర్ పై ప్రజల్లో అవగాహన పెరిగితే గుండెపోటుతో కుప్పకూలిన వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించగలమని, వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి, వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తే అనేక ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయన పార్టీలోకి ఆహ్వానిస్తే
# మేము ఒప్పుకోము

- సర్పంచ్ పదవి కోసం తమ్ముడినే చంపినోడు
- రేపు ఎమ్మెల్యే పదవి కోసం నన్ను కూడా చంపొచ్చు
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జడ్చర్ల, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మొదటినుంచి సంచలనాలకు, వివాదాస్పద వ్యాఖ్యలకు కేరాఫ్‌గా నిలిచిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని ఇందుకు అంతా సిద్ధం అయిందని జరుగుతున్న ప్రచారంపై అనిరుధ్ రెడ్డి స్పందించారు. ఇక్కడ ఇప్పటి వరకు ఫ్యాక్షన్ రాజకీయాలు లేవన్నారు. సర్పంచ్ పదవి కోసం సొంత తమ్ముడిని హత్య చేశారు. రేపు ఎమ్మెల్యే పదవి కోసం నన్ను కూడా చంపొచ్చని హాట్ కామెంట్స్ చేశారు. ఇలాంటి వారి కోసం జెడ్ కేటగిరి సెక్యూరిటీ అడగాలా? అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు మేము ఓడిపోవాలని ప్రయత్నం చేసిన వారిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవాలంటే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవరూ ఒప్పుకునే పరిస్థితి లేదన్నారు. వారికి గేటు వద్దకు వెళ్తే కనీసం అపాయింట్ మెంట్ కూడా దొరకదని కావాలనే ఇలాంటి లీకులు ఇస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకోవడంపై ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ క్లారిటీతో ఉన్నారన్నారు. కాగా ఎర్రశేఖర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు.

# బాల్య వివాహాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు



చిన్న పిల్లలకు అన్నప్రాసన అక్షరాభ్యాసం చేస్తున్న జిల్లా కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

- బాల్య వివాహాలు చేస్తే వధూవరుల తల్లిదండ్రులతో పాటు వివాహంలో పాల్గొన్న ప్రతి ఒకరి పై కేసు నమోదు..!
- వనపర్తి జిల్లాలో మధ్యలోనే చదువు మానేసిన 181మంది విద్యార్థులను తిరిగి కళాశాలల్లో చేర్పించాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్టోబరు 13 ప్రభాతవార్త :** జిల్లాలో బాల్య వివాహాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అందుకు లైన్ డిపార్టుమెంట్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సెప్టెంబర్ 17 నుండి ప్రారంభమైన పోషణ మాసం కార్యక్రమం సందర్భంగా ఇచ్చిన లక్ష్యాలు, చేపట్టిన కార్యక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లాలో 498 మంది ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలను ఎన్.ఆర్.సి. సెంటర్ లో వైద్యంతో పాటు పౌష్టికాహారం అందించి వైద్యం చేయించినట్లు తెలిపారు. జనవరి1 నుంచి ఇప్పటి వరకు వనపర్తి జిల్లాలో 31 బాల్య వివాహాలు కేసులు నమోదు అయినట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 181 మంది విద్యార్థులు కళాశాల నుండి మధ్యలోనే చదువు మానేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో 121 అబ్బాయిలు ఉండగా 60 మంది అమ్మాయిలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన జిల్లా కలెక్టర్ చదువు మానేసిన అమ్మాయిలు ఎక్కడున్నారో గుర్తించి తిరిగి కళాశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ, సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు.ఎట్టిపరిస్థితుల్లోను జిల్లాలో బాల్య వివాహాలు నిర్వహించడానికి వీలు లేదని ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే మాత్రం అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులతో పాటు వివాహంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి పై చట్టరీత్య కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అక్టోబర్ 15న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామస్థాయి కమిటీలు సమావేశాలు నిర్వహించి అదే రోజున మండల కమిటీలో ఏర్పాటు చేయాలని డి.పి.ఓ, డి.ఆర్.డి. ఎ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 17న జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలకు సంబంధించిన ముందస్తు సమాచారం 1098 లేదా 100 లేదా 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. పౌష్టికాహార లోపంతో ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్యవంతులుగా ఉండేటట్లు సంబంధిత అంగన్‌వాడి కార్యకర్తలు చూసుకోవాలని సూచించారు. ఈ వారంలో తల్లి పాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, అవగాహన కార్యక్రమానికి గర్భిణీ, బాలింత మహిళల భర్తలు సైతం సదస్సుకు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. అనంతరం ఆర్.డి.ఎస్. స్వచ్ఛంద సంస్థ చిన్నమ్మ థామస్ వారు రూపొందించిన "ఇచ్చట బాల్య వివాహం నిర్వహించబడవు" అనే గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిల్లలకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు పాల్గొని అన్న ప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు గర్భిణులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి పిడి ఆర్‌డిఓ ఉమాదేవి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## కిటికీకి ఉరేసుకుని
# గురుకుల విద్యార్థి మృతి

- రామ్ రెడ్డి గూడ గురుకుల పాఠశాలలో ఘటన
- బాధిత కుటుంబాలకు కలెక్టర్ పరామర్శ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా రామిరెడ్డి గూడలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియర్ మొదటి సంవత్సరం చదువుతున్న యు.ప్రియాంక సోమవారం ఉదయం 7.10 నిమిషాలప్రాంతంలో గురుకుల కళాశాల హాస్టల్ బాత్ రూం కిటికీకి ఉరి వేసుకుని చనిపోయిన ఘటనపై అధికారులతో విచారణ జరుపనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.. – మిగతా4లో..

## ప్రజావాణి కార్యక్రమంలో ఒక దరఖాస్తు స్వీకరణ

**ఎంపీడీవో శివ ప్రసాద్, తాహసిల్దార్ సుందర్ రాజ్**

**దేవరకద్ర, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తామని కౌకుంట్ల ఎంపీడీవో శివప్రసాద్, తాహసిల్దార్ సుందర్ రాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రం లోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ప్రజావాణికి ఒక్క దరఖాస్తును అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుడు తమ సమస్యలను అధికారులతో మాట్లాడుతూ కౌకుంట్ల గ్రామ కంఠం నుండి ఆశన్న పొలం,రేకలంపల్లి శివారు వరకు రైతులకు బాట ఏర్పాటు చేయాలని సాంబశివుడు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను వారంలోపు అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఎంకెఓ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

## ఎడ్లబండ్లతో ఇసుకను తోడేస్తున్నారు

**మహబూబ్‌నగర్ (చిన్నచింతకుంట) అక్టోబరు 13 ప్రభాతవార్త :** మండలంలోని ఊక చెట్టు వాగు నుంచి రాత్రి వేళల్లో ఎడ్లబండ్లతో అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. మండలంలోని అల్లిపూర్ గ్రామంలో పగలు, రాత్రి అని తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు ఎడ్లబండ్లతో ఇసుకను తోడేస్తున్నారు. ఊక చెట్టు వాగులో నీళ్ళు ఉన్న ఇసుకను తరలించడం ఆపడం లేదు. ఎడ్లబండ్ల యజమానులు ఇసుకను తరలించి రహస్య ప్రదేశాలలో ఉంచుతూ ఆపై ట్రాక్టర్ల ద్వారా ఇతర మండలాలకు అక్రమార్కులు పాల్పడుతున్నారు. గ్రామాలలో ఇండ్ల నిర్మాణం, అభివృద్ధి పనులకు తహసిల్దార్ అనుమతి తీసుకొని ఇసుక తీసుకోవాలే తప్ప ఇష్టానుసారంగా ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరమని తహసిల్దార్ ఎల్లన్న హెచ్చరించారు. అక్రమంగా ఇసుకను తరలించే ఎడ్లబండ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి పట్టుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి వేళల్లో రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచుతామని ఆయన తెలిపారు. మండలంలో అల్లిపూర్‌తో పాటు ఇతర గ్రామాలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం ఉందని వాటిపై కూడా దృష్టి పెడతామని ఆయన తెలిపారు.



ఎడ్లబండ్ల తో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

## డిసిసి అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు అందజేత

**ఉప్పునుంతల, అక్టోబరు 13 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి తమకు కట్టబెట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్ రెడ్డి సంస్థ గత ఎన్నికల పరిశీలకురాలు సంధ్యా రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ కు దరఖాస్తు అందజేశారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం కుందల మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ప్రస్తుతం నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న జిల్లెల జగత్ రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనకు కేటాయించాలని ఆయన విన్నవించుకున్నారు. అదేవిధంగా మండలానికి చెందిన పలువురు దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులు అందజేసిన వారిలో డిసిసి ప్రధాన కార్యదర్శి జగత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మడ్డి తిరుపతయ్య గౌడ్, అంతటి శేఖర్ గౌడ్, పాత్కుల రామచంద్రయ్య, మేకల రామచంద్రయ్య, గోవింద్ సింగ్ తదితరులు ఉన్నారు.



డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు అందజేస్తున్న జిల్లేల జగత్ రెడ్డి

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

**నారాయణ పేట, అక్టోబరు 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ నరసింహ రావు కళ్యాణి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకునికి ఎన్నుకున్న సందర్భంగా సమితి అధ్యక్షులు హరినారాయణ భట్టడ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆదర్శమని శ్రద్ధ అంకిత భావంతో బోధిస్తూ ఎంతో మంది విద్యార్థులను రాష్ట్ర దేశ విదేశాలలో ఉన్నత స్థానాలకు చేర్చారని తెలిపారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో పాత్ర విశేషమని పేర్కొన్నారు. ఆయనను శాలువా పూలమాల నారికేళంతో సన్మానం చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుండి అందుకున్న బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొ.డా.నరసింహరావు కళ్యాణిని హిందీ ప్రచార సమితి నిర్వాహకులు అధ్యక్షులు,హిందీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో అమర్‌నాథ్ కాంబ్లే, సుఖ్‌దేవ్,రాకేష్, హెచ్.నర్సింహా, విఠల్ రావు, బల్బీర్, దీపక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ అధ్యాపకుడ్ని సన్మానిస్తున్న దృశ్యం

## రేపటి నుంచి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

**ఉప్పునుంతల పశువైద్యాధికారి డా. జి. ప్రవీణ్ కుమార్**

**ఉప్పునుంతల, అక్టోబరు 13 ప్రభాతవార్త :** మండలంలో పశువైద్యశాల ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో రేపు 15 న బుధవారం నుంచి వచ్చేనెల నవంబర్ 14 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో పశువులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్ తెలిపారు. పాడి రైతులు మూడు నెలల పైబడిన అన్ని పశువులు, గేదెలకు వ్యాధి నివారణ టీకాలు వేయించుకొని శిబిరాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గ్రామ పాడి రైతులందరూ ముందుగానే గ్రామంలో టీకాలు వేయడానికి అనుకూలమైన ఒకేచోట నిర్ణయించుకొని తమ పాడిపశువుల్ని నిర్ణయించిన చోటకు తీసుకొచ్చి వ్యాధి నివారణ టీకాలు వేసుకొని పశువైద్య సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

**రేపు మామిళ్ళపల్లిలో...**

రేపు బుధవారం,గురువారాల్లో 15,16న మండలంలోని మామిళ్ళపల్లి, 15,16,17న అయ్యావారిపల్లి గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడానికి శిబిరం నిర్వహిస్తున్నట్లు పశువై ద్యాధికారి డా. జి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ శిబిరానికి గ్రామంలోని పాడి రైతులు పశువులు, గేదెలను శిబిరానికి తీసుకొచ్చి వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు.

## అంగరంగ వైభవంగా ఆరాధన ఉత్సవాలు

**అమరచింత అక్టోబర్ 13, ప్రభాతవార్త:** అమరచింత మండలంలో నాగల్ కడుమూర్ గ్రామంలో వెలసిన విశ్వకర్మ జగద్గురు శ్రీ దేవేంద్రాచార్య మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం దేవేంద్రాచార్యుల మఠం లో పిఠాధిపతులు, వేద పండితులు మంత్రోచ్ఛనులతో విశ్వకర్మ జగదుర్గ దేవేంద్ర చారి ఆలయములో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాయత్రి పిఠాధిపతి శ్రీకాంత్రేంద్ర స్వామి హాజరై భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు మన ధర్మాన్ని మనమే కాపాడుకోవాలని ఆయన భక్తులకు హితబోధ చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ఆయన భక్తులకు కోరారు. గ్రామంలో దేవేంద్ర చార్యుల భక్తులు భారీ ఎత్తున కోలాటం, భక్తి గీతాలాపనలతో పల్లకి సేవ నిర్వహించారు. నాగల కడుమూరు గ్రామంలో జరుగుతున్న విశ్వకర్మ జగదుర్గ దేవేంద్రాచార్యుల ఆరాధనకు ఉత్సవాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలంధర్ రెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, అయూబ్ ఖాన్, జగన్ రెడ్డి విశ్వకర్మ జగదుర్గ శ్రీ దేవేంద్రాచార్యుల మఠం నిర్వాహకులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠం నిర్వాహకులు నరసింహ చారి, కోమాటి విరేష్ ఆచారి, రామకృష్ణారెడ్డి, సురేష్ ఆచారి, నవీన్ ఆచారి, నందకుమార్ ఆచారి, గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు.



గ్రామంలో అంగరంగ వైభవంగా మఠాచార్యుల ఆరాధన ఉత్సవాలు

# గద్వాలను పార్లమెంటు నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

**ఐజను అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి**

**మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణకి**

**వినతి పత్రం సమర్పించిన ఐజ అఖిలపక్ష కమిటీ**

**అలంపూర్ అక్టోబర్ 13, ప్రభాతవార్త :** గద్వాల పట్టణంలోని డీకే అరుణ నివాసములో అఖిలపక్ష కమిటీ కలిసి రానున్న 2026లో జరగనున్న డి లిమిటేషన్ ద్వారా గతంలో గద్వాల పార్లమెంటు నియోజకవర్గంగా ఉండేదని రాజకీయ కారణాలతో గద్వాలను మార్చి నాగర్‌కర్నూల్ పార్లమెంటుగా ఏర్పాటు చేయడం జరిగిందని సువిశాలమైన నాగర్ కర్నూల్ పార్లమెంట్, అచ్చంపేట నుండి ఐజ వరకు 200 కిలోమీటర్లు విస్తరించి ఉందని ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాలో మరొక పార్లమెంటు నియోజకవర్గంగా ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆ సందర్భంగా గద్వాలను మరొక పార్లమెంటుగా ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని అది ప్రజలకు అనుకూలంగా ఉంటుందని దీంతో గద్వాల జిల్లా మరింత అభివృద్ధిచెందే అవకాశం ఉంటుందని పార్లమెంటు సభ్యురాలుగా డీలిమిటేషన్లో భాగస్వామ్యం తీసుకొని చొరవతో గద్వాలను పార్లమెంటుగా రూపొందించాలని అఖిలపక్ష కమిటీ నాయకులు కోరారు. డి లిమిటేషన్ ద్వారా అసెంబ్లీ సీట్లు పెరిగే అవకాశం ఉన్నందున అందులో దినదిన అభివృద్ధి చెందుతున్న గద్వాలకు దీటుగా జనాభాలో అభివృద్ధిలో ఉన్న ఐజ కేంద్రంగా మరో నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని మండలాలు ఏవి కలిపిన తమకు అభ్యంతరం లేదని జిల్లాలో మరో అసెంబ్లీ ఏర్పాటు అవసరముందని ముందు నుంచే ఈ దిశగా ప్రభుత్వం దగ్గర పై రెండు ప్రతిపాదనలు ఉంచి అవి నెరవేరేటట్లు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఎం పి.డీకే.అరుణ మాట్లాడుతూ,ఐజా అసెంబ్లీ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి తప్పకుండా ఐజను అసెంబ్లీగా రూపొందించడానికి కృషి చేస్తానని ఈ విషయంలో సఫలమయ్యే అవకాశాలు కచ్చితంగా ఉన్నాయని ఆమె భరోసా ఇచ్చారు గతంలోనే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచామని తప్పక మీ కోరిక నెరవేరుతుందని చెప్పారు పార్లమెంటు నియోజకవర్గం ఏర్పాటులో ఏ ప్రాతిపదికన తీసుకున్న నాగర్కర్నూల్ పార్లమెంటు చాలా విశాలంగా ఉందని పార్లమెంట్ సభ్యులు అచ్చంపేట నుండి ఐజ వరకు తిరగడము కష్టమవుతుందని పార్లమెంట్ సభ్యులు ప్రజలను కలుసుకునే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఇంత విస్తీర్ణంలో ప్రజల బాగోగులు చూడడం వారి కోసం పనిచేయడం కష్టమవుతుందని వైశాల్యపరంగా చూస్తే గద్వాలను పార్లమెంటు నియోజకవర్గంగా ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందని హైదరాబాదులోని కొన్ని నియోజకవర్గాల్లో జనాభా ఎక్కువ ఉన్న జనసాంద్రత కూడా ఎక్కువగా ఉంటుందని తక్కువ విస్తీర్ణంలోనే ఎక్కువ జనాభా ఉంటుంది కాబట్టి సువిశాలమైన నాగర్ కర్నూలు పార్లమెంటు మహబూబ్నగర్ పార్లమెంటు నుండి కొన్ని నియోజకవర్గాలను కలిపి గద్వాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందని దీనికోసం ప్రభుత్వం దగ్గర ప్రతిపాదనలోంచి తప్పక కృషి చేస్తానని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ జిల్లా అధ్యక్షులు మరియు టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు,ఐజ అఖిలపక్ష కమిటీ అధ్యక్షులు సాకలి ఆంజనేయులు, గౌరవాధ్యక్షులు జగపతి రెడ్డి,బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి,అఖిలపక్ష కమిటీ నాయకులు రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎండి తయార్, బి ఆర్ ఎస్ వి. రాష్ట్ర నాయకులు మరియు జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, రంగు అశోక్, మహేష్ బాబు, కిరణ్,తెలుగు శ్రీనివాసులు, రాఘవేంద్ర రెడ్డి శరణప్ప పులికల్లు రామాంజనేయులు నేష బసవరాజు, తోక నాగన్న తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అరుణకు వినతి పత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

## అలంపూర్ నియోజకవర్గంలో మారుతున్న రాజకీయాలు

**కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు**

**కండువా కప్పి ఆహ్వానం పలికిన ఎఐసిసి కార్యదర్శి**

**అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్**

**అలంపూర్ అక్టోబర్ 13, ప్రభాతవార్త :** హైదరాబాద్ లోని ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ నివాసంలో అలంపూర్ నియోజక వర్గం అయిజ మండలానికి చెందిన పలువురు బి ఆర్ ఎస్ నాయకులు. బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు భూంపురం నరసింహ రెడ్డి ,ఉప్పల తిప్పన్నలు మరియు కురువ రమేష్ మాజీ దేవాలయ డైరెక్టర్ రంగన్న గౌడ్, ముగినుపల్లి మాజీ సర్పంచి,కురువ నాగేద్ర , బోయ ఆంజనేయులు ,నాగేంద్ర, అంజి,దాసప్ప తిమ్మప్ప, కురవ భీమన్న, కురవ భీమేశ్ తదితరులు బిఆర్ఎస్ పార్టీని వదిలి ఈరోజు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.వారికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు . ఈ కార్యక్రమంలోఅలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ దొడ్డ కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ గౌడ్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ,స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పావులు కథపాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఐజ మరియు అల్లంపూర్ వడ్డేపల్లి రాజోలి మానపాడు ఇటిక్యాల మండలాలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాడని ఈ సంక్షేమ పథకాలను తీసుకువెళ్లి ప్రజలకు సూచించాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రధానంగా ఆయా గ్రామాలలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయవంతంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిలబడే అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువా కప్పుతున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

**కూలి పని ఇస్తామని తీసుకెళ్లి అత్యాచారం చేసిన నిందితున్ని**

## కఠినంగా శిక్షించాలి : పిఓడబ్ల్యు, పిడిఎస్‌యు, పివైఎల్

**నారాయణపేట టౌన్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** మెదక్‌లో మహిళకు కూలి పని ఇస్తామని తీసుకెళ్లి అత్యాచారం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలనీ పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు శారద , పి.డి.ఎస్ యు జిల్లా అధ్యక్షుడు ఎస్. సాయికుమార్, జిల్లా కార్యదర్శి అజయ్ పి.వై.ఎల్ జిల్లా నాయకులు కృష్ణ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో సమావేశమై వారు మాట్లాడుతూ పొట్టకూటికి కూలి పని వెతుక్కుంటున్న మహిళకు పని ఇస్తామని చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఆమెను చిత్రహింసలు పెట్టి తీవ్రంగా గాయపరిచారు. అత్యాచారానికి పాల్పడడమే కాక,వివస్త్రను చేసి అక్కడి ఓ చిన్న స్తంభానికి కట్టేసి పరార్ అయ్యారు. రాత్రంతా ఆ నిర్మానుష్య ప్రదేశంలోనే ఉన్న ఆ మహిళను ఉదయాన్నే అటుగా వచ్చిన వారు గుర్తించడంతో ఈ దుర్మార్గమైన సంఘటన వెలుగు చూసింది. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిపాలైన ఆమె చికిత్స పొందుతూ మరణించిన పరిస్థితి. బెంగాల్లో మరో ఘోరం, ఒడిశాకు చెందిన ఒక వైద్య విద్యార్థిపై ఓ ప్రైవేటు వైద్యా కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున విద్యార్థిని పై తన స్నేహితుడితో కలిసి భోజనానికి క్యాంపస్ బయటకు రాగా, ముగ్గురు గుర్తు తెలియని యువకులు వారి వద్దకు వస్తే. నమ్మి వచ్చిన స్నేహితుడే ఆమెను ఒంటరిగా వదిలి వెళ్లడం సిగ్గుచేటు. దేశంలో వరుసగా మహిళలపై దాడులు అత్యాచారాలు జరిగితే ప్రభుత్వ పాలకులు ఎందుకు స్పందించరు. ఆడపిల్లలకు చట్టం ఉంది అనే నమ్మకం ఎందుకు కల్పించ లేక పోతున్నారు. అమ్మాయిలపై అత్యాచారాలకు, వేధింపులకు గురి చేసే వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా కోశాధికారి మహేష్, జిల్లా నాయకురాలు నందిని, రాజు, అరవింద్, పరిసరం, అభి, నరసింహ, అనూష, నందిని, హారిక, మనిషా, పూజ, కవిత తదితరులు ఉన్నారు.





మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

## ప్రధాని,ఎంపి చిత్ర పటాలకు క్షీరాభిషేకం

**ప్రధాని మోడీ రైతు పక్షపాతి : లక్ష్మి శ్యామ్ సుందర్**

**నారాయణపేట టౌన్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** వెనుక బడిన జిల్లాల రైతుల శ్రేయస్సు కోసం ప్రధాని నరేంద్రమోడీ పిఎం ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రధాని నరేంద్రమోడీ, ఎంపి.డికె. అరుణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కెంచే శ్రీనివాసులు,జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ మాట్లాడుతూ ఈ పథకం కింద నారాయణపేట జిల్లా ఎంపిక కావడం జిల్లా రైతుల అదృష్టమని అన్నారు. పిఎం దన్ ధాన్య కృషి యోజన ద్వారా వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ పథకం 6 ఏళ్ల పాటు కొనసాగుతుందని ఏడాదికి జిల్లాకు 240 కోట్ల నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. దీంతో వెనుక బడిన జిల్లాల్లో వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. నారాయణపేట జిల్లా ను ఈ పథకం మంజూరు చేసిన ప్రధాని నరేంద్రమోడీకి అందుకు కృషి చేసిన పాలమూరు ఎంపి డికె అరుణ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రఘువీర్ యాదవ్, రఘు రామయ్య గౌడ్, మిర్చి వెంకటయ్య, సత్య రఘు పాల్, గోపాల్ యాదవ్, శ్రీపాద, శ్యామ్ సుందర్ రావు, వద్దే దత్తు, మాజీ సర్పంచ్ శివప్ప, పళ్ల రఘు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





క్షీరాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

## సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్

**ఆత్మకూర్ అక్టోబర్ 13, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం రోజు ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాంతాలలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో సైతం అనారోగ్యాల బారిన పడి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న వారిని గుర్తించి తక్షణమే ముఖ్యమంత్రి సహాయ నీతి చెక్కులను పంపిణీ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. గడచిన ఆరు నెలల వ్యవధిలో ఉమ్మడి ఆత్మకూరు మండలంలో పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి సహాయ నిధులను చెక్కులను పంపిణీ చేసిన ఘనత మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిడి శ్రీహరికే దక్కుతుందని ఆయన అన్నారు. ఉమ్మడి ఆత్మకూరు మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి వాకిడి శ్రీహరి ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లగొండ శ్రీనివాసులు, మణి వర్ధన్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, గుంటుపల్లి రాములు, నాగేశ్వర్ రెడ్డి తదితరులతో పాటుగా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అమరచింతలో అభివృద్ధి పనులు చేపట్టండి

**అమరచింత అక్టోబర్ 13, ప్రభాతవార్త :** మండల అభివృద్ధికి నిధులు కేటాయించిన పనులు ప్రారంభం కాలేదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, ఎండి కుతుబ్ కోరారు.సోమవారం మండల కేంద్రంలోని ఆయన మాట్లాడుతూ, అమరచింత మండలంలోని జడ్.పి. హెచ్.ఎస్ పాఠశాల ఆవరణలో ఉన్న స్థితుల వ్యవస్థలో ఉన్న పాత భవనాలను కూల్చివేసి కోటి రూపాయల నిధులతో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని ఆయన అన్నారు. అలాగే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం 15 కోట్ల నిధులు కేటాయించామని చెబుతున్న ఇప్పటివరకు మున్సిపాలిటీ కేంద్రంలో పనులు జరగడం లేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అమరచింత మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమరచింత మండలంలోని అభివృద్ధి పనులు చేపట్టకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

## తండ్రిపై కొడుకు దాడి :కేసు నమోదు

**లింగాల ఎస్సై వెంకటేశ్వర్లుగౌడ్**

**లింగాల,అక్టోబరు13 ప్రభాతవార్త:** తండ్రిపై కొడుకు దాడి చేసిన సంఘటన లింగాల మండలంలోని పద్మనపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పద్మనపల్లి గ్రామానికి చెందిన ఆంగోతు విజయ్ (30) అనే వ్యక్తి గత కొంత కాలంగా ఏ పనులు చేయకుండా గ్రామంలో తిరుగుతూ తన తల్లిదండ్రులతో గొడవ పడుతున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం సమయంలో తన తండ్రిని డబ్బులు ఇవ్వమని అడగా, డబ్బులు ఇవ్వకపోవడంతో తలపై కొట్టడం వల్ల తలకు బలమైన గాయం తగినట్లు తెలిపారు. తండ్రి తౌర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## హాస్టల్ వార్డెన్ సస్పెండ్

**విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**మహబూబ్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంతో మొన్న జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి మండల పరిధిలోని ఎన్మనగండ్ల బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ బందెమ్మను సస్పెండ్ చేస్తూ నిన్న మం డల స్పెషల్ ఆఫీసర్ సునీత జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేయడం జరిగింది. విద్యార్థినులకు అందుబాటులో ఉండకుండా మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ బందెమ్మను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక ఆహారాన్ని అందించకుంటే ప్రతి ఉద్యోగిపై చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి సునిత ఈ సందర్భంగా తెలియజేశారు.

## బాబోయ్ కుక్కలు..



గుంపులు గుంపులుగా కుక్కలు తిరుగుతున్న దృశ్యం

**దేవరకద్ర, అక్టోబరు 13 ప్రభాతవార్త:** వీధి కుక్కల సంచారం రోజురోజుకు పెరుగుతుంది. ఎక్కడ చూసినా గుంపులుగా తిరుగుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రధాన రహదారులు, కాలనీలలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరిగి ద్విచక్ర వాహనాదారులు, పాదచారుల వెంట పడుతున్నాయి. ఒంటరిగా వెళ్తే దాడి చేసి గాయపరుస్తుండడంతో కౌకుంట్ల పట్ట ణవాసులు, పుట్టపల్లి గ్రామస్తులు, ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట వీధి కుక్కలు గుంపులుగా చేరి రోడ్లపై వాహనాల వెంటపడి, అరుస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## భజన సామాగ్రి అందజేత

**వెల్దండ,అక్టోబర్13 ప్రభాతవార్త:** మండలంలోని రాఘాయిపలిన గ్రామంలో కార్తీకమాస భజన కార్యక్రమాలకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి భజన సామాగ్రిని కొనుగోలు చేసి భజనపరులకు సోమవారం బిఆర్ఎస్ నాయకులు బర్కం గణేష్ద్వారా భజనపరులకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అనాది నుండి వస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలను కాపాడుకొని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగులు శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, గిరి, బాలయ్య, ఈదన్న, యాదయ్య తదితరులు ఉన్నారు.

**విద్యార్థులు చదువుపై దృష్టి సారించి**

## సమాజంలో ఉన్నత స్థితికి ఎదగాలి



విద్యార్థులకు షూస్ టైస్ అందజేస్తున్న గోపాల్ శర్మ

**ఖిల్లా గణపురం అక్టోబర్ 13, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుపై దృష్టి సారించి సమాజంలో ఉన్నత స్థితికి ఎదగాలని సిద్ధాంతి జోషి గోపాల్ శర్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సోలిపురం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు 255 మందికి షూస్, బెల్టు, ఐడెంటిటీ కార్డులు, టైలు, తన సొంత డబ్బు 30000 రూపాయలతో కొనుగోలు చేసి విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులతో పాటు పాఠశాల గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ప్రతి ఒక్కరూ నిరుపేద విద్యార్థులు చదువులో రాణించడానికి తమ వంతు సహకారం అందిస్తే వారు భవిష్యత్తులో స్థిరపడితే జీవితాంతం సహకారాలు అందజేసిన వారిని గుర్తించుకుంటారని చెప్పారు.కార్యక్రమంలో ఎంఈవో జయశంకర్ శేఖర్ రెడ్డి పోచ రవీందర్ రెడ్డి తిరుమల్ బాల్రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు అజీమ్ భాష శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

